# మహిళా కార్మికులకు రక్షణేది



**ఉద్యోగంలో ఉండాలంటే చెప్పింది వినాల్సిందేనని వేధింపులు**

**శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ వికృత చేష్టలు**

- బదిలీ చేసినా అతడిలో మారని తీరు
- కార్మికురాలితో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియో వైరల్
- ఉన్నతాధికారులకు తెలియడంతో విధుల నుంచి తొలగింపు

**కుత్బుల్లాపూర్:** ఓ మహిళా పారిశుద్ధ్య కార్మికురాలితో అసభ్యంగా ప్రవర్తిస్తూ అడ్డంగా దొరికిన శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి డిస్మిస్ చేస్తూ సదర్ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేసిన పారిశుద్ధ్య కార్మికుడిని సస్పెండ్ చేస్తూ గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాలతో కూకట్పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన విచారణ చేసే క్రమంలో ఈ విషయం బయటపడింది.

**అధికారులకు తెలియడంతో మొదట ట్రాన్స్‌ఫర్..**

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్–26లో షాపూర్‌నగర్ శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వ్యక్తి అదే ప్రాంతంలో పనిచేస్తున్న ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వీడియో తీసుకున్నాడు. వీడియోను చూపిస్తూ కొన్నిసార్లు ఆమెను ఇలాగే లొంగదీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వీడియో పలు గ్రూపుల్లో చెక్కర్లు కొట్టడంతో ఆ నోట.. ఈ నోట సంబంధిత అధికారులకు తెలిసింది. దీంతో ఉపకమిషనర్ మల్లారెడ్డి (మల్లయ్య), వైద్య ఆరోగ్య అధికారి చంద్రశేఖర్‌రెడ్డి సదరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను షాపూర్‌నగర్ నుంచి సూరారం ఏరియాకు బదిలీ చేశారు. ఇది రెండు నెలల క్రితం జరిగింది.

**అతడిలో మార్పు రాకపోవడంతో విధుల నుంచి తొలగింపు..**

◆ అతడిలో మార్పు రాకపోగా పలువురు మహిళలతో ఇదే తరహాగా అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో అధికారులు నాలుగు రోజుల క్రితం అతడిని విధులకు దూరంగా పెట్టారు. తదనంతరం విచారణ చేపట్టిన అధికారులు పలువురు నుంచి వివరణ తీసుకుంటున్న క్రమంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. విచారణ చేపట్టిన ఉప కమిషనర్ మల్లారెడ్డి (మల్లయ్య) గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాలతో గురువారం విధుల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు 'సాక్షి'ప్రతినిధి అడిగిన వివరణకు సమాధానం ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఓ కార్మికుడిపై చర్యలు తీసుకున్నారు.

**బిడ్డ పెళ్లి కోసం వెళ్తూ ఫోన్ కార్మికుడికి ఇచ్చి..**

◆ తాను తీసుకున్న గోతిలోనే... తానే పడినట్లు పలుమార్లు మహిళా కార్మికులతో తన వికృత చేష్టలను సెల్‌ఫోన్‌లో బంధించుకున్న శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ ఇటీవల తన కుమార్తె వివాహం నేపథ్యంలో సదరు ఫోన్‌ను తోటి కార్మికుడికి ఇచ్చి వెళ్లాడు. ప్రతిరోజు ఆన్‌లైన్ ఫొటోలు తీసి పంపించాలని సూచించాడు.

◆ ఈ క్రమంలో ఫోన్‌లో వీడియోలు గుర్తించి వాటిని ఇతరులకు షేర్ చేశాడు. వారం రోజుల తర్వాత డ్యూటీలో చేరగా ఈ విషయం అప్పటికే చెక్కర్లు కొడుతూ కనిపించడంతో అధికారులకు గుర్తించి స్థానికంగా ఉన్న అతడిని సూరారం పంపించారు. గతంలో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ గొడవను చిత్రీకరించి అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్‌కు పంపించారు. ఆ తర్వాత సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌ను అక్కడ నుంచి బదిలీ చేశారు.

**అతడు తీసుకున్న వీడియోనే కొంపముంచింది...**

◆ చివరకు ఫీల్డ్ అసిస్టెంట్ తీసుకున్న వీడియోనే అతడి కొంప ముంచిందని చర్చించుకోవడం కనిపించింది. సోషల్ మీడియాలో వైరల్ చేసిన సదరు కార్మికుడిని సైతం ప్రస్తుతం విధుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు.

**గతంలోనూ పలువురి వికృత చేష్టలు..**

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో పలువురు అధికారులతో పాటు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వారు సైతం తోటి కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వారిని లొంగదీసుకునే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని విషయాలు వెలుగులోకి రాగా మరికొన్ని విషయాలు వెలుగులోకి రాకుండా పోయాయి.

◆ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఓ అధికారి ఓ కార్మికురాలితో అసభ్యకరంగా మాట్లాడి లొంగదీసుకునే ప్రయత్నం చేయగా సదరు ఆడియో వెలుగులోకి రావడంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ వైద్య ఆరోగ్య అధికారిగా పని చేసిన మరో వ్యక్తి కూడా ఇదే తరహాలో మహిళ కార్మికురాలితో అసభ్యంగా ప్రవర్తించడంతో బదిలీ వేటుపడింది.

◆ తాజాగా శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్ ఘటన వెలుగులోకి రావడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు.

◆ ఇలా అనేక ఘటనలు పారిశుద్ధ్య మహిళా కార్మికులకు జరుగుతున్న ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడం మూలంగానే ఎటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి.

**ఆగమ్య గోచరంగా మహిళా కార్మికుల పరిస్థితి...**

◆ గాజులరామారం సర్కిల్ పరిధిలో మొత్తం 56 యూనిట్లలో మొత్తం 392 మంది కార్మికుల పనిచేస్తుండగా అందులో అత్యధికంగా మహిళా కార్మికులే ఉన్నారు. వీరికి 19మంది శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎస్ఎఫ్ఏ) ప్రతిరోజు ఉదయం ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలి.

◆ ఈ నేపథ్యంలో మహిళా కార్మికులతో వారు వ్యాహరించిన తీరు వివాదాస్పదంగా ఉన్నప్పటికీ తమ పని తాము చేసుకుంటూ వస్తున్నారు. సదరు ఫీల్డ్ అసిస్టెంట్ లపై ఫిర్యాదు చేస్తే మరుసటి రోజు నుంచి టార్చర్ తప్పదని కొంతమంది వెనకడుగు వేస్తుండగా మరి కొంత మంది వాటిని భరిస్తూ ముందుకు సాగుతున్నారు.

◆ వీరికి భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ వారు కేవలం శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పిన వాటినే పట్టించుకుంటూ మహిళా కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదని ప్రధాన ఆరోపణ.ఈ విషయంపై ఏమైనా ఫిర్యాదులు అందాయా? అని జీడిమెట్ల పోలీసులను 'సాక్షి' ప్రతినిధి కోరగా ఎలాంటా ఫిర్యాదులు అందలేవని తెలిపారు.

## డ్రైనేజీ యంత్రం తొలగించకుంటే రాకపోకలకు కష్టం



సూరారం ప్రధాన రోడ్డులో వదిలేసిన డ్రైనేజీ క్లీనింగ్ యంత్రం

**సుభాష్‌నగర్:** అసలే ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు ఇప్పుడు డ్రైనేజీ శుభ్రం చేసే యంత్రాన్ని రోడ్డుపైనే వదిలేయడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారింది. సూరారం ప్రధాన రోడ్డులోనీ నారాయణ ఆస్పత్రి వద్ద డ్రైనేజీ శుభ్రం చేయడానికి యంత్రాలను తీసుకువచ్చారు. పని అనంతరం వాటిని తీసుకువెళ్లకుండా రోడ్డుపైనే గత వారం రోజులు నుంచి అలాగే వదిలేశారు. దీంతో ఉదయం సాయంత్రం రద్దీగా ఉన్నప్పుడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డుపై వదిలేసిన యంత్రాలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

## రోడ్డుపైకి వచ్చి నిర్మాణం

**అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు**



రోడ్డుపై చేపట్టిన నిర్మాణాన్ని చూపుతున్న కృషి కాలనీవాసులు

**సుభాష్‌నగర్:** వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్డుపైకి జరిగి నిర్మాణం చేపడుతున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్ కృషి కాలనీ రోడ్ నం.10లో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని రోడ్డుపైకి వచ్చి చేపడుతున్నాడని తెలిపారు. భవిష్యత్‌లో రాకపోకలకు తమకు ఆటంకాలు ఏర్పడుతాయని అన్నారు. తక్షణమే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బయటకు వచ్చి చేపట్టిన నిర్మాణానికి కూల్చి వేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## వైభవం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**కుత్బుల్లాపూర్:** గాజులరామారం డివిజన్ మెట్ కానిగూడలోని నల్లగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి క్యూ కట్టి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్‌లు కల్యాణ మహోత్సవానికి హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రసేన గుప్తా, యాదగిరి, శ్రీరాములు, ఎం.సాగర్, సురేష్, నర్సింహారెడ్డి, లక్ష్మణ్, సంజీవరెడ్డి, నరసమ్మ, కావలి శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు



తమలపాకులు, అరటిపండ్లతో అలంకరణ



ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

**నిజాంపేట్:** నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని పంచముఖ ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి తమవంతు సహాయంగా ఆలయ కమిటీ చైర్మన్, మేయర్ కొలన్ నీలారెడ్డి దంపతులు రూ.1.30 లక్షలు విరాళంగా అందజేశారు. స్వామి వారిని దర్శించుకున్న మేయర్ దంపతులకు ప్రధాన అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భగా ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 31న ఫీజుల నియంత్రణపై రౌండ్‌టేబుల్ సమావేశం

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ–ఆవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 31న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జస్టిస్ చంద్ర కుమార్ హాజరు కానున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి తెలిపారు.

## మాజీ వీసీలపై విచారణ చేపట్టండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వివిధ వర్సిటీలలో వీసీలుగా పని చేసిన వారిపై విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు తొత్తులుగా వ్యవహరిస్తూ వర్సిటీల అభివృద్ధిని అడ్డుకొని స్వయంప్రతిపత్తిని (అటానమస్) బలహీన పరిచారని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ వీసీలపై విచారణ జరపాలన్నారు.

**ఓయూ మాజీ వీసీపై..**

కేయూ మాజీ వీసీపై తీసుకున్న చర్యల తరహా ఓయూ మాజీ వీసీ ప్రొ.రవీందర్‌పై తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వేతన బకాయిల చెల్లింపు, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు, పదవులు, పదోన్నతుల అక్రమాలపై ప్రశ్నించిన అధ్యాపకులను ముప్పు తిప్పలు పెట్టిన మాజీ వీసీ ప్రొ.రవీందర్ పై కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తన మూడేళ్ల పాలనలో ఇష్టారాజ్యాంగా వ్యవహరించిన ప్రొ.రవీందర్ సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులపై ప్రొ.తిరుపతిరావు సమర్పించిన నివేదికను బహిర్గతం చేయలేదన్నారు. 2016 నుంచి 2019 వరకు గల అధ్యాపకులందరికి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

## బీజేపీలో బీసీలకు అధిక ప్రాధాన్యం



కన్వీనర్ శేఖర్‌యాదవ్, కోకన్వీనగర్ శివాజీరాజును సత్కరిస్తున్న బీజేపీ డివిజన్ల అధ్యక్షులు

**జగద్గిరిగుట్ట:** మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని బీజేపీ అత్యధిక మెజార్టీతో కైవసం చేసుకుంటుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జీకే శేఖర్‌యాదవ్ అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ డివిజన్ల అధ్యక్షులు కో.కన్వీనర్ శివాజీరాజు, కన్వీనర్ శేఖర్‌యాదవ్‌లను శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వచ్చే లోక్‌సభ ఫలితాల్లో ఈటల రాజేందర్ ఎంపీగా గెలుపొందడం దాదాపు ఖాయమైందన్నారు. పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. నియోజకవర్గంలో బీజేపీని అజేయశక్తిగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ల అధ్యక్షులు సాయినాథ్, పరుష వేణు, సతీష్, రాజేశ్వర్‌రావు, బలరామ్, దుర్యోధన్‌రావు, నాగరాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

**డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులకు జిల్లా రవాణా అధికారి ఆదేశం**



డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న జిల్లా రవాణా అధికారి

**కుత్బుల్లాపూర్:** రాంగ్ రూట్.. సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మేడ్చల్ జిల్లా రవాణా అధికారి రఘునందన్‌గౌడ్ అన్నారు. గురువారం మేడ్చల్ రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్లు నడిపేవారు తప్పకుండా సీటు బెల్ట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులు తమ వద్దకు శిక్షణ నిమిత్తం వచ్చే వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా ద్విచక్ర వాహనదారులు సిగ్నల్ జంపింగ్ చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త సేకరణ విషయంలో బాధ్యతగా మెలగాలి



సమావేశంలో సూచనలు చేస్తున్న ఉపకమిషనర్ నరసింహ

**కుత్బుల్లాపూర్:** చెత్త సేకరణ విషయంలో బాధ్యతాయుతంగా పని చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ స్పష్టం చేశారు. గురువారం శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు, రిసోర్స్ పర్సన్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. ఇళ్ల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటో రిక్షాలకు అందించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, రిసోర్స్‌పర్సన్లు, పొదుపు సంఘాల మహిళలు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్ఓ భార్గవ్ నారాయణ, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన అక్రమ నిర్మాణాల తొలగింపు

**కుత్బుల్లాపూర్:** అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు, కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించే ప్రక్రియ చేపట్టారు. గురువారం కుత్బుల్లాపూర్ గ్రామం నుండి సుచిత్ర కు వెళ్లే రోడ్డులో వీటిని తొలగిస్తూ కనిపించారు. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ డబ్బాలు ఏర్పాటు చేసుకొని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడటమే కాకుండా డబ్బాల వద్ద వాహనాలు నిలుపుతున్నారు. 'ఈ ప్రాంతంలో ప్రయాణించాలంటేనే నరకం'అనే సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. స్థానికంగా ఉన్న డబ్బాలను తొలగించారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులతో పాటు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ ఉన్నారు.



కుత్బుల్లాపూర్-సుచిత్ర రోడ్డులో డబ్బాలను తొలగిస్తున్న ట్రాఫిక్, టౌన్‌ప్లానింగ్ అధికారులు

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**కుత్బుల్లాపూర్:** విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొంపల్లి ఏఈ వినాయక్‌రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేవీఆర్ గార్డెన్స్, సినీ ప్లానెట్, ఆర్‌డీ కన్వెన్షన్, వెంకటరెడ్డి గోదాము ఏరియా, ఎన్‌సీఎల్ నార్త్, విజన్ ఇన్‌ఫ్రా, 11కేవీ ధోలారీ ధనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు చంద్రారెడ్డి గార్డెన్స్, ధోలారీ ధనీ, శ్రీకాంత్‌రెడ్డి ఎస్టేట్స్, సాయికృపా అపార్ట్‌మెంట్స్, బొల్లారం రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదు.

**పేట్‌బషీరాబాద్ పరిధిలో..**

◆ సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దండమూడి ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్ సింధు, అన్షు అపార్ట్‌మెంట్స్, సురక్ష ఆస్పత్రి ఏరియా, ఆర్టీఏ కార్యాలయం, పుల్లారెడ్డి స్వీట్స్, 11 కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు జయరామ్‌నగర్, శ్రీకృష్ణనగర్, గణేష్ కాలనీ, రుక్మిణి ఎస్టేట్స్, మహానగర్, గోదావరి హోమ్స్, జేకేనగర్, చర్మాస్ జీన్స్‌ఫ్యాక్టరీ ఏరియాల్లో విద్యుత్ ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ తెలిపారు.

**బోయిన్‌పల్లి ఏడీఈ పరిధిలో..**

◆ గాంధీనగర్–ఐడీపీఎల్ రహదారిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీసాయినగర్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గాంధీనగర్, మారుతినగర్, వెంకట్రామిరెడ్డినగర్‌లలో, 11కేవీ గిరినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, విజయకృష్ణ ఆర్కేడ్, గురుమూర్తినగర్, 11కేవీ చింతల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చింతల్ ప్రధాన రోడ్డు, బస్టాప్, అయ్యప్పస్వామి ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉందని ఏడీఈ పేర్కొన్నారు.

**భౌరంపేట్ సెక్షన్ పరిధిలో...**

**నిజాంపేట్:** చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా అటంకాలు ఏర్పడనున్నాయని భౌరంపేట్ సెక్షన్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కోకకోలా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సింహపురి కాలనీ, డాలర్ డ్రీమ్స్, ఎస్‌బీఐ కాలనీ, నెక్స్ విల్లాస్, గోకుల్ బృందావన్, డీఆర్‌కే కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

## ఔట్‌లెట్‌లకు లేవు మరమ్మతులు

- మురుగు సాఫీగా వెళ్లని వైనం
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- సుభాష్‌నగర్‌లో నిత్యం ఇబ్బందులు



రోడ్డుపై పారుతున్న మురుగు



మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న మురుగు

**జీడిమెట్ల:** జీహెచ్ఎంసీ పరిధిలోనే పెద్ద డివిజన్. శానిటేషన్ నిర్వాహణలో మాత్రం అధికారుల చిన్నచూపు. ఉదయం వేళల్లో సుభాష్‌నగర్‌లో ఎక్కడ చూసిన రోడ్లపై మురుగు పారుతూ ఉంటుంది. స్కూళ్లకు, ఉద్యోగాలకు వెళ్లాలంటే ప్రజలు ముక్కు మూసుకుని మురుగు నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సిందే..

◆ సుభాష్‌నగర్‌లోని పలు రోడ్లలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయ్యింది. భూగర్భ డ్రైనేజీ ఔట్‌లెట్‌లు సరిగా లేకపోవడంతో మురుగు సాఫీగా వెళ్లకపోవడంతో మ్యాన్‌హోళ్ల నుంచి పొంగి రోడ్లపై పారుతోంది.

◆ ఔట్‌లెట్‌లు సరిగా లేని చోట మరమ్మతులు నిర్వహించాల్సిన జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు మాత్రం తూతూమంత్రంగా పనులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఐదేళ్లుగా ఈ తంతు సాగుతున్నప్పటికీ అధికారులు మాత్రం సమస్యకు శాస్వత పరిష్కారం చేయడం లేదు.

◆ ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ఒక ప్రణాళికతో పనిచేసి యూజీడీ ద్వారా మురుగు సాఫీగా వెళ్లేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**పన్నుల వసూళ్లు సరి.. మరి సౌకర్యాల కల్పనేదీ?**

◆ ప్రజల నుంచి ఇంటి, వాణిజ్య పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం విఫలం అవతున్నారని సుభాష్‌నగర్ ప్రజలు అంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సుభాష్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయం, లాస్ట్ బాస్టాప్ నుంచి ఫాక్స్‌సాగర్ వెళ్లే రోడ్డు, వెంకటాద్రినగర్‌లో మురుగు రోడ్లపై పారుతున్న అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం అని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సమస్య ఇలానే ఉంటే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు తప్పవు..**

◆ ఇప్పటికే రోడ్లపై మురుగు పారుతుండగా ఇక వర్షాకాలం వస్తే మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు వర్షపు నీటితో కలిసి పెద్ద ఎత్తున బయటకు వస్తుందని ప్రజలు అంటున్నారు. కొన్ని చోట్ల మరీ దారుణంగా మ్యాన్‌హోళ్ల మూతలు తెరచి ఉంటున్నాయని వాటి వల్ల వర్షాకాలంలో ఎవరైరా మ్యాన్‌హోళ్లలో పడితే పరిస్థితి ఎంటని సుభాష్‌నగర్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా నాలాలో పడి కొట్టుకుపోతే ఎవరు భాధ్యత వహిస్తారని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి**



నేను ఐదేళ్లుగా హనుమాన్ దేవస్థానం రోడ్డులో బాదాం మిల్క్ వ్యాపారం నిర్వహిస్తున్నాను. ఇక్కడ చాలా సంవత్సరాల నుంచి మురుగునీటి ఔట్‌లెట్‌లు సరిగా లేక మురుగు రోడ్లపై పారుతోంది. ప్రతిసారి మున్సిపల్ సిబ్బంది వచ్చి సమస్య పరిష్కరించిన తర్వాత మళ్లీ అదే పరిస్థితి నెలకొంటోంది. దీనికి శాస్వత పరిష్కారంగా మరమ్మతులు నిర్వహిస్తే బాగుంటుంది.

– కిషన్, జ్యూస్ వ్యాపారి, సుభాష్‌నగర్

## మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తానని రూ.10లక్షల కుచ్చుటోపీ

**జీడిమెట్ల:** కరెన్సీ ఎజెన్సీ సంస్థను నమ్మిన ఓ వ్యక్తి రూ.10లక్షలు మోసపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల, బాధితుల వివరాల ప్రకారం.. చింతల్ వల్లాభాయ్ పటేల్‌నగర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డి సోదరుడు మహేందర్‌రెడ్డి ఉన్నత చదువుల నిమిత్తం యూకే వెళ్తున్నారు. యూనివర్సిటీ ఫీజు చెల్లించేందుకు బషీర్‌బాగ్‌లోని మనీ ట్రాన్స్‌ఫర్ ఫెరోజ్ ఫ్రేమోజ్ సంస్థ మేనేజర్ రాజును సంప్రదించారు.

◆ రూ. 3లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మరునాడు చింతల్ ఎస్‌బీఐ ద్వారా రూ.3లక్షలు సదరు సంస్థకు చెల్లించాడు. మేనేజర్ రాజు మరుసటి రోజు రాజేందర్‌రెడ్డికి ఫోన్ చేసి రూ.3లక్షల బదిలీ అలస్యం అవుతుందని తెలిపి క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించుకోమ్మని సలహా ఇచ్చాడు.

◆ ఇది నమ్మిన రాజేందర్‌రెడ్డి క్రెడిట్ కార్డు వివరాలు రాజుకు ఇచ్చాడు. అతను రూ.7లక్షలు బదిలీ చేసుకున్నాడు. అప్పటి నుంచి రాజుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చిన రాజేందర్‌రెడ్డి బషీర్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. జీడిమెట్ల సీఐ పి.శ్రీనివాసరావు ఈ విషయమై విచారణ చేపట్టారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029